నమస్తే తెలంగాణ
# హైదరాబాద్
హైదరాబాద్- మేడ్చల్
I హైదరాబాద్, సోమవారం 10 జూన్ 2024 | HYDERABAD

## నేటి నుంచి ప్రజావాణి

సిటీబ్యూరో, జూన్ 9 ( నమస్తే తెలంగాణ ) : ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం నేటి నుంచి యధావిధిగా కొనసాగుతుందని జిల్లా అదనపు కలెక్టర్ పాటిల్ హేమంత్ కేశవ్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పార్లమెంట్ ఎన్నికల నిబంధనలతో ప్రజావాణి కార్యక్రమాన్ని తాత్కాలికంగా వాయిదా వేసిన విషయం తెలిసిందే. ప్రస్తుతం పార్లమెంట్ ఎన్నికల ప్రక్రియ ముగియడంతో ప్రతి సోమవారం ప్రజావాణి కార్యక్రమం జరుగుతుందన్నారు. ప్రజలు తమ సమస్యలను దరఖాస్తు రూపంలో అధికారులకు అందించొచ్చని చెప్పారు. జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలో ప్రజావాణి నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి కమిషనర్ ఆమ్రపాలి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి 11.30 గంటల వరకు ఫోన్ ఇన్ ప్రోగ్రాం , 040-2322 2182 నంబర్‌కు తమ సమస్యలను విన్నవించవచ్చని సూచించారు. అనంతరం ప్రజల నుంచి విన్నపాలను స్వీకరిస్తామన్నారు. జోనల్, సర్కిల్ కార్యాలయాల్లో కూడా ప్రజావాణి ఉంటుందని ఇన్‌చార్జి కమిషనర్ ఆమ్రపాలి వెల్లడించారు.




## అవయవదానం..ఎందరికో ప్రాణదానం



రన్‌ను ప్రారంభిస్తున్న ప్రతినిధులు

బేగంపేట జూన్ 9: అవయవదానంపై ఆదివారం నెక్లెస్‌రోడ్‌లో అవగాహన పరుగు నిర్వహించారు. సంజీవయ్య పార్కు నుంచి 10కే, 5కే రన్ సాగింది. మోహన్ ఫౌండేషన్ సీనియర్ ట్రాన్స్‌ప్లాంట్ కో ఆర్డినేటర్ డాక్టర్ భానుచంద్ర, బ్రిల్స్ సీఈవో రామ్‌నరేశ్ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. తెలంగాణ 10కే రన్ రెండో ఎడిషన్ పేరిట రన్ ఫర్ ఆర్గాన్ అవేర్నెస్ పరుగులో పలువురు రన్నర్స్, వైద్యులు, యువతీయువకులు, చిన్నారులు పెద్ద సంఖ్యలో ఉత్సాహంగా పాల్గొన్నారు. మరణించినా..అవయవదానం ద్వారా మరొకరికి జీవితాన్ని ఇచ్చి ఎంతోమంది ప్రాణాలు నిలుపవచ్చని పలువురు పేర్కొన్నారు. ప్రజల్లో అవయవదానంపై అవగాహన పెంచడంతో పాటు కొందరిలో ఉన్న అపోహలను పోగొట్టేందుకు ఈ అవగాహన రన్ నిర్వహించినట్టు నిర్వాహకులు వెల్లడించారు.



## వర్ష సూచన

సిటీబ్యూరో, జూన్ 9 (నమస్తే తెలంగాణ): రుతుపవనాల ప్రభావంతో గ్రేటర్‌లోని పలు చోట్ల తేలికపాటి జల్లులు కురిశాయి. మరికొన్ని చోట్ల మోస్తరు వాన కురిసింది. ఆదివారం రాత్రి 8 గంటల వరకు నగరంలో అత్యధికంగా 7 మి.మీల వర్షపాతం నమోదైనట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. రుతుపవనాలు విస్తరిస్తుండటంతో రాగల మరో రెండు రోజులు గ్రేటర్‌లోని పలు చోట్ల ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వానలు కురిసే అవకాశాలున్నట్లు తెలిపింది. ఈ నేపథ్యంలో గ్రేటర్‌కు ఎల్లో అలర్ట్ హెచ్చరికలు జారీ చేసింది. కాగా, వర్షపాతం కారణంగా నగరంలో ఉష్ణోగ్రతలు సాధారణ స్థాయి కంటే తక్కువకు పడిపోయాయి. ఆదివారం ఉదయం నుంచి రాత్రి వరకు నగరంలో గరిష్ఠం 30.4, కనిష్ఠం 23.8 డిగ్రీలు, గాలిలో తేమ 68 శాతంగా నమోదైనట్లు అధికారులు వెల్లడించారు.




## సజావుగా గ్రూప్-1 ప్రిలిమ్స్

### 300 స్పెషల్ బస్సులు నడిపిన ఆర్టీసీ

### హైదరాబాద్ జిల్లాలో 15,518, మేడ్చల్ జిల్లాలో 20,765 మంది పరీక్షకు గైర్హాజరు

సిటీబ్యూరో, జూన్ 9 ( నమస్తే తెలంగాణ )/మేడ్చల్ : గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్ష ఆదివారం సజావుగా జరిగింది. అభ్యర్థులు నిర్ణీత సమయాల్లో కేంద్రాలకు చేరుకుని పరీక్ష రాశారు. అక్కడక్కడ కొందరు అభ్యర్థులు చివరి నిమిషంలో పరీక్షా కేంద్రాలకు పరుగులు తీయడం కనిపించింది. కాగా, 10 గంటల తర్వాత వచ్చిన అభ్యర్థులను లోపలికి అనుమతించలేదు. అప్పటికే సిబ్బంది గేట్లు మూసేశారు. ఎలాంటి మాల్ ప్రాక్టీస్‌కు తావులేకుండా విద్యార్థులను క్షుణ్ణంగా తనిఖీ చేసిన అనంతరం లోపలికి అనుమతించారు. ఉదయం 10:30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పరీక్ష జరిగింది. మొత్తంగా హైదరాబాద్‌లో 77 పరీక్షా కేంద్రాల్లో 40,569 మంది అభ్యర్థులు పరీక్ష రాయాల్సి ఉండగా, 25,051 మంది అభ్యర్థులు పరీక్ష రాశారు. 15,518 మంది అభ్యర్థులు గైర్హాజరు అయినట్టు అధికారులు ఒక ప్రకటనలో వెల్లడించారు. మేడ్చల్ జిల్లాలో గ్రూప్ -1 పరీక్ష ప్రశాంతంగా జరిగింది. 105 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయగా, 69,727 మందిలో 48,962 మంది మాత్రమే పరీక్షకు హాజరయ్యారు. కలెక్టర్ గౌతమ్ కూకట్‌పల్లిలోని ఎంఎన్‌ఆర్ డిగ్రీ అండ్ పీజీ కళాశాల, ప్రతిభ డిగ్రీ కళాశాల, బాలానగర్‌లోని మార్టిన్ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాలను సందర్శించారు. మరోవైపు గ్రూప్- 1 ప్రిలిమినరీ పరీక్షకు హాజరయ్యే అభ్యర్థుల కోసం 300 ప్రత్యేక బస్సులు నడిపినట్లు గ్రేటర్ హైదరాబాద్ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వెంకటేశ్వర్లు తెలిపారు. గ్రేటర్ వ్యాప్తంగా ఉన్న పరీక్షా కేంద్రాలకు వెళ్లేందుకు చాలా మంది అభ్యర్థులు బస్సు సేవలను ఉపయోగించుకున్నారని చెప్పారు. రంగారెడ్డి, మేడ్చల్, మల్కాజిగిరి, చేవెళ్ల, అబ్దుల్లాపూర్‌మెట్, ఇబ్రహీంపట్నం, కీసర, మొయినాబాద్, గండి మైసమ్మ తదితర ప్రాంతాలకు బస్సులు నిర్ణీత సమయాల్లో అందుబాటులో ఉంచామన్నారు.

### అభ్యర్థిని..సమయానికి పరీక్షా కేంద్రానికి చేర్చి..

గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్ష రాసేందుకు జీడిమెట్లకు చెందిన నిషిత ఆదివారం అబిడ్స్ బస్టాప్‌లో దిగారు. అయితే ఆమెకు సుల్తాన్‌బజార్‌లోని ప్రగతి మహా విద్యాలయంలో సెంటర్ పడింది. అప్పటికే సమయం మించిపోతుండటంతో కంగారుపడుతుండగా, అక్కడే విధులు నిర్వహిస్తున్న కాచిగూడ ఆర్టీసీ డిపో మేనేజర్ రఘు గమనించి.. వివరాలు తెలుసుకున్నారు. తన కారులో ఆమెను సమయానికి పరీక్షా కేంద్రానికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా నిషిత మేనేజర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

-కాచిగూడ, జూన్ 9




# కంటి తుడుపుగా..పచ్చదనం


## ఈ ఏడాది 30.81 లక్షల మొక్కలతోనే సరి..

గ్రేటర్‌లో పచ్చదనం పెంపుపై కాంగ్రెస్ సర్కారు శీతకన్ను

కేసీఆర్ ప్రభుత్వ హయాంలో 8 సార్లు హరితహారం.. ఏటా కోటి మొక్కల పెంపకం

నగరానికి ట్రీ సిటీ ఆఫ్ వరల్డ్ ఘనత

మహా నగర పరిధిలో 147 శాతం పెరిగిన అటవీ విస్తీర్ణం



గ్రేటర్‌లో పచ్చదనం పెంపునకు

**నిర్దేశిత లక్ష్యాలు**

| జోన్ | టార్గెట్ |
|---|---|
| ఎల్బీనగర్ | 6,62,610 |
| చార్మినార్ | 4,22,190 |
| ఖైరతాబాద్ | 4,48,500 |
| శేరిలింగంపల్లి | 6,15,000 |
| కూకట్‌పల్లి | 5,80,125 |
| సికింద్రాబాద్ | 3,53,400 |

సిటీబ్యూరో, జూన్ 9 (నమస్తే తెలంగాణ ) : గ్రేటర్‌లో పచ్చదనం పెంపుపై కాంగ్రెస్ సర్కారు శీతకన్ను వేసింది. కంటి తుడుపు చర్యగా ఈ ఏడాది జీహెచ్‌ఎంసీ పరిధిలో కేవలం 30.81 లక్షల మొక్కలతో ముగించాలని ప్రణాళికలు సిద్ధం చేసింది. ఈ మేరకు కూకట్‌పల్లి, ఎల్బీనగర్, చార్మినార్, ఖైరతాబాద్, శేరిలింగంపల్లి, సికింద్రాబాద్ జోన్లకు నిర్దేశిత లక్ష్యాలను ఖరారు చేసింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఈ నెలాఖరులోగా పచ్చదనం పెంపునకు ప్రత్యేక పథకాన్ని తీసుకొచ్చి అమలు చేసేందుకు సన్నద్ధమవుతున్న దరిమిలా.. ఈ మేరకు జీహెచ్‌ఎంసీ గ్రీనరీ పెంపునకు నామ మాత్రంగా చర్యలు చేపట్టడంపై తీవ్ర విమర్శలు వెలువెత్తుతున్నాయి. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో 8 సార్లు హరిత హారం ద్వారా ప్రతి ఏటా గ్రేటర్ కోటి మొక్కలను నాటారు. ఖాళీ స్థలాల్లో యాదాద్రి మోడల్ మియవాకి, వర్టికల్, థీమ్ పార్కులు, మెరిడియన్ , అవెన్యూ ప్లాంటేషన్, జంక్షన్ సుందరీకరణ ట్రీ పార్కులు వంటి పేర్లతో పచ్చదనం, సుందరీకరణ పనులను చేపట్టారు. కాలనీలను పచ్చదనంతో నింపేశారు. ఫలితంగా హైదరాబాద్ మహా నగర పరిధిలో 147 శాతం అటవీ విస్తీర్ణం పెరిగింది. గతంలో 33.15 చదరపు కిలోమీటర్లు అటవీ విస్తీర్ణం ఉండగా, బీఆర్‌ఎస్ సర్కారు చేపట్టిన తెలంగాణకు హరిత హారం కార్యక్రమం తర్వాత అటవీ విస్తీర్ణం 81.81 స్క్వేర్ కిలో మీటర్లకు పెరిగినట్లు ఎఫ్‌ఎస్‌ఐ (ఫారెస్ట్ సర్వే ఆఫ్ ఇండియా) ప్రకటించింది. ఎఫ్‌ఎస్‌ఐతో పాటు అర్బోర్ డే ఫౌండేషన్ సంస్థ, ఎఫ్‌ఏఓ (ఫుడ్ అండ్ అగ్రికల్చర్ ఆర్గనైజేషన్ ఆఫ్ యూఎన్) సంస్థలు 2020 సంవత్సరానికి గాను హైదరాబాద్ నగరాన్ని ట్రీ సిటీ ఆఫ్ వరల్డ్‌గా గుర్తించింది. 63 దేశాలకు చెందిన 119 పట్టణాలు, నగరాలు ఈ పోటీలో పాల్గొనగా, హైదరాబాద్ నగరానికి ట్రీ సిటీ ఆఫ్ వరల్డ్ ఘనత దక్కింది. పచ్చదనం పెంపునకు బీఆర్‌ఎస్ సర్కారు పెద్ద పీట వేస్తే.. కాంగ్రెస్ ప్రభుత్వం గ్రీనరీ పెంపుపై చిన్నచూపు చూడటం పట్ల పర్యావరణవేత్తలు మండిపడుతున్నారు. గ్రేటర్‌లో పచ్చదనం పెంపునకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని కోరుతున్నారు.



# 70 వేల మంది.. ప్రసాదం స్వీకరించి..

### ముగిసిన చేప మందు పంపిణీ

### విశేష సేవలందించిన స్వచ్ఛంద సంస్థలు

అబిడ్స్, జూన్ 9: మృగశిర కార్తె ప్రవేశం సందర్భంగా బత్తిని కుటుంబం నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో చేపట్టిన చేప ప్రసాదం పంపిణీ కార్యక్రమం ఆదివారం ముగిసింది. సాయంత్రం వరకు వివిధ ప్రాంతాల నుంచి ఆస్తమా వ్యాధిగ్రస్తులు తరలివచ్చి ప్రసాదాన్ని స్వీకరించారు. మొత్తం 70 వేల మందికిపైగా చేప ప్రసాదాన్ని స్వీకరించినట్టు నిర్వాహకులు తెలిపారు. కాగా, మత్స్య శాఖ అధికారులు 55 వేల 440 వరకు కొర్రమీన్ల విక్రయాలు చేపట్టారు. శాకాహారులు మాత్రం వేరుగా ప్రసాదాన్ని స్వీకరించారు. ఇదిలా ఉంటే, చేప ప్రసాదం పంపిణీ సందర్భంగా పలు ప్రభుత్వ శాఖల అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని సౌకర్యాలు కల్పించారు.

#### మానవత్వాన్ని చాటిన స్వచ్ఛంద సంస్థలు

చేప ప్రసాదం కోసం వచ్చిన ఆస్తమా వ్యాధిగ్రస్తులకు ఫలహారాలు అందించి.. పలు స్వచ్ఛంద సంస్థలు మానవత్వాన్ని చాటుకున్నాయి. జలమండలి లక్షల మంచినీటి ప్యాకెట్లతో పాటు నలభై వాటర్ ట్యాంకుల ద్వారా తాగునీటిని సరఫరా చేసింది. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సెంట్రల్ జోన్ డీసీపీ అక్షాంశ్‌యాదవ్ స్వీయ పర్యవేక్షణలో అబిడ్స్ ఏసీపీ చంద్రశేఖర్, బేగంబజార్ ఇన్‌స్పెక్టర్ విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా బందోబస్తును ఏర్పాటు చేశారు.

#### ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు

**-మెట్టు సాయికుమార్, తెలంగాణ మత్స్య సహకార సంఘాల సమాఖ్య చైర్మన్**

వివిధ ప్రభుత్వ శాఖల సమన్వయంతో చేప ప్రసాదం పంపిణీ కార్యక్రమం విజయవంతమైందని తెలంగాణ మత్స్య సహకార సంఘాల సమాఖ్య చైర్మన్ మెట్టు సాయికుమార్ పేర్కొన్నారు. ఇందుకు సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. జీహెచ్‌ఎంసీ అధికారులు తాత్కాలికంగా మరుగుదొడ్లను ఏర్పాటు చేయడంతో పాటు పారిశుధ్య సమస్య తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకున్నారన్నారు.

## వరద నివారణకు 542 అత్యవసర బృందాలు

### శాశ్వతంగా వాటర్ స్టాగ్నేషన్ పాయింట్ల తొలగింపు

### వర్షం పడినప్పుడు ఉద్యోగులను ఒకేటైంలో పంపించొద్దు

### ఐటీ కంపెనీలకు బల్దియా అధికారుల సూచన

సిటీబ్యూరో, జూన్ 9 (నమస్తే తెలంగాణ ) : వర్షాకాలం నేపథ్యంలో వరదలతో లోతట్టు ప్రాంతాల ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా, ఎలాంటి ప్రమాదాలు జరగకుండా, ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా వరద నివారణకు ఎప్పటికప్పుడు చర్యలు తీసుకునేందుకు మాన్‌సూన్ ఎమర్జెన్సీ టీమ్‌లను జీహెచ్‌ఎంసీ ఏర్పాటు చేసింది. ముఖ్యంగా వరద నీరు నిలిచే (వాటర్ స్టాగ్నేషన్) పాయింట్ల వద్ద ఎప్పటికప్పుడు వరద నీటిని తొలగించి నివారణ చర్యలు చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు. అగ్నిమాపక శాఖ, వాటర్ వర్క్స్, పోలీస్, విద్యుత్ శాఖల సమన్వయంతో గ్రేటర్‌లో వరదల నివారణ, విద్యుత్, రవాణా వ్యవస్థలతో ప్రజలకు సమస్య లేకుండా చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. ఈ మేరకు గ్రేటర్ వ్యాప్తంగా 542 మాన్‌సూన్ అత్యవసర బృందాలను ఏర్పాటు చేసినట్లు అధికారులు వెల్లడించారు.

#### 125 వాటర్ స్టాగ్నేషన్ పాయింట్లు

వర్షాకాలంలో ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా జీహెచ్‌ఎంసీ, ఇతర శాఖలతో కలిపి మొత్తం 542 అత్యవసర బృందాలను ఏర్పాటు చేశారు. గ్రేటర్ వ్యాప్తంగా 125 వాటర్ స్టాగ్నేషన్ పాయింట్లు ఉండగా, వాటిని దశలవారీగా శాశ్వతంగా తొలగిస్తామని అధికారులు వివరించారు. ప్రస్తుతం 32 వాటర్ లాగింగ్ పాయింట్లను కూడా వచ్చే వర్షాకాలం నాటికి పూర్తిగా తొలగించేందుకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు.



#### వ్యర్థాలు వేయకుండా..

నాలాలో ప్రజలు వ్యర్థాలు వేయకుండా సహకరించాలని అధికారులు విజ్ఞప్తి చేశారు. వాటర్ స్టాగ్నేషన్ పాయింట్ల వద్ద డ్రైనేజీ వ్యవస్థను మెరుగు పరిచేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. వర్షం పడినప్పుడు ఐటీ కంపెనీలు..తమ సిబ్బందిని ఒకే సమయంలో పంపించకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అదే విధంగా ఇతర కంపెనీలు, కార్యాలయాలు కూడా పలు జాగ్రత్తలు తీసుకుంటే మంచిదని, ప్రజలు కూడా అత్యవరమనుకుంటేనే బయటకు రావాలన్నారు. డ్రైనేజీ మూతలు ఓపెన్ చేయకూడదని, వర్షాకాలంలో ప్రజలకు వరద సమస్యలు ఎదురైనప్పుడు బల్దియా కాల్ సెంటర్‌కు ఫోన్ చేయాలన్నారు.

## పెండింగ్‌లోనే 'ధరణి'

మేడ్చల్, జూన్ 9 (నమస్తే తెలంగాణ): ధరణి దరఖాస్తులకు మోక్షం ఎప్పుడో అని దరఖాస్తుదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ధరణి దరఖాస్తులను పరిష్కరించేందుకు కార్యాచరణ రూపొందించామని రెవెన్యూ యంత్రాంగం చెబుతున్నా.. ఇప్పటి వరకు పెండింగ్ సమస్యలు పరిష్కరం కాలేదని దరఖాస్తుదారులు ఆరోపిస్తున్నారు. మేడ్చల్ జిల్లా వ్యాప్తంగా 2 వేల పైచిలుకు ధరణి పెండింగ్ దరఖాస్తులు ఉన్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. గతంలో ధరణి సమస్యలను పరిష్కరించేందుకు జిల్లా కలెక్టర్లకు మాత్రమే అధికారం ఉండేది. అయితే వేల సంఖ్యలో దరఖాస్తులు ఉన్న నేపథ్యంలో పెండింగ్ సమస్యల సత్వర పరిష్కారానికి ఇటీవలే ఆర్డీవోలు, తహసీల్దార్లకు లాగిన్ సౌకర్యం కల్పించామని ఉన్నతాధికారులు చెబుతున్నారు. తహసీల్దార్లకు పట్టా అసైన్డ్ భూముల విరాసత్(పౌతి), స్పెషల్ ల్యాండ్స్ మ్యాటర్స్, ఖాతా మెర్జింగ్ వంటి వాటికి బాధ్యతలు అప్పగిస్తూ లాగిన్ సౌకర్యం కల్పించినట్లు చెప్పారు. కాగా, పార్లమెంట్ ఎన్నికలకు ముందు రెవెన్యూ యంత్రాంగం ధరణి పెండింగ్ దరఖాస్తుల పరిష్కారానికి స్పెషల్ డ్రైవ్ నిర్వహించినా.. ఎలాంటి ఫలితం రాలేదు.

16వ వర్ధంతి

ప్రముఖ వ్యాపారవేత్త ,నిరంతర శ్రమజీవి, నిత్యకృషీవలురు, మా ఉన్నతికి అహర్నిశలు శ్రమించి మంచితనాన్ని, అందరికి పంచిన సహనశీలి, మాకు బంగారు భవిష్యత్తును చూపిన మీరు మాకు దూరమై 16 సంవత్సరాల కాలం గడుస్తున్నా మీ మధుర జ్ఞాపకాలు మా మదిలో ఎల్లప్పుడూ మెదులుతూనే ఉంటాయి. మీ ఆశయాలు, ఆదర్శాలు మాకు ఎప్పటికీ మార్గదర్శక సూత్రాలు. ఆ దైవ సన్నిధికి చేరిన మీ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ....

అశ్రునయనాలతో.....



కీ॥శే॥ శ్రీ పాటేల్ పరమేశ్వర్ యాదవ్ గారు
మరణం : 10-06-2008 ప్రముఖ వ్యాపారవేత్త

భార్య : కీ॥శే॥ శ్రీ పాటేల్ విమలమ్మ యాదవ్

కుమారులు - కోడళ్ళు:
పాటేల్ క్రిష్ణా యాదవ్ - పాటేల్ రుక్మిణి యాదవ్
పాటేల్ గోపాల్ యాదవ్ - పాటేల్ అనురాధ యాదవ్

కూతుళ్ళు - అల్లుళ్ళు :

మనుమలు - మనుమరాండ్రు :

మునిమనుమలు :

మునిమనుమరాళ్ళు :

బృందావన్ నిలయం, గాంధీనగర్, హైదరాబాద్